

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

కొందుర్గు, ఆగస్టు 24 : ఆధ్యాత్మిక చింతనతో మనిషికి మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం రాంచంద్రాపూర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. నేడు ప్రతీ ఒక్కరు వారి విధుల్లోనే, వృత్తుల్లోనో లేక ఏదో ఒక రకంగా ఒత్తిడికి గురవుతున్నారన్నారు. భక్తి భావంతో జీవన విధానంలో ఒత్తిడిని తగ్గించుకునే అవకాశం ఉందని అన్నారు. అనంతరం సోమారంపాడుకు చెందిన విద్యార్థులు ఎమ్మెల్యేను కలిశారు. తమ గ్రామ స్టేజీ వద్ద బస్సులకు హాల్ట్ కల్పించాలని కోరారు. స్టేజీ వద్ద బస్సులు నిలపేలా డీఎంతో మాట్లాడుతానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వివిధ గ్రామాల నాయకులు ఉన్నారు.





పుష్ప సోయగం!

కనువిందు చేస్తున్న పూల తోటలు

పచ్చని బంతి.. అలరిస్తున్న చామంతి, ఎర్రని గులాబీలు. ఇలా అనేక రకాల పుష్ప సోయగాలు కనువిందు చేస్తున్నాయి. రోడ్డు పక్కన పొలాల్లో సాగు చేసిన పూలతోటలు ఎంతో ఆహ్లాదాన్ని.. ఆనందాన్ని కలిగిస్తున్నాయి. పచ్చని ఆకులపై పురి విప్పిన నెమలిలా ఆ పూబంతులు నాట్యం చేస్తున్నట్టుగా కనిపిస్తున్నాయి. మొయినాబాద్ మండలం అమ్డాపూర్, కాశీంబౌలి గ్రామాల్లో ఈ సుందర మనోహర రూపం ఆ ప్రాంతాల నుంచి వెళుతున్న వారిని మంత్ర ముగ్ధులను చేస్తోంది. ఈ దారిన వెళుతున్న అనేకమంది తమ వాహనాలను ఆపుకొని ఈ సుందర దృశ్యాన్ని తమ సెల్‌ఫోన్లలో బంధించుకోవడంతో పాటు సెల్ఫీలు, ఫొటోలు దిగి అనుభూతి పొందుతున్నారు.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా







హిమాయత్‌నగర్‌లో కాంగ్రెస్ నేతలతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి

త్వరలోనే మన్నెగూడ

రోడ్డు పనులు ప్రారంభం

- గ్రామీణ రోడ్డు పనులూ పూర్తిచేస్తాం
- పల్లె ప్రాంతాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 24: త్వరలోనే లంగర్ హౌస్ టిప్పుఖాన్ బ్రిడ్జి నుంచి మన్నెగూడ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమవుతాయని.. మన్నెగూడ నుంచి బీజాపూర్ వరకు రోడ్డు పనులు ఇప్పటికే పూర్తి అయ్యాయని రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్‌కు ప్రైవేటు పనిపై వచ్చిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని స్థానిక కాంగ్రెస్ నేతలు కలిశారు. ఈ సందర్భంగా మధ్యలోనే నిలిచి పోయిన హైదరాబాద్-మన్నెగూడ రోడ్డు విస్తరణ పనులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వెంటనే మంత్రి కోమటిరెడ్డి సంబంధిత శాఖ అధికారులకు ఫోను చేసి మాట్లాడారు. త్వరలోనే పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఫోనులోనే ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా మండలంలో అర్థంతరంగా నిలిచిపోయిన గ్రామాలకు వెళ్లే రోడ్ల పనులను కూడా ఆయన దృష్టికి తీసుకురాగా సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. హైడ్రా కమిటీ తన పని తాను చేసుకు పోతోందని ఇందులో ఎలాంటి సందేహాలూ అక్కర్లలేదన్నారు. ఇటీవల కాంగ్రెస్‌కు చెందిన కీలక నేత ఫాంహౌస్‌ను కూల్చివేసిన విషయాన్ని మంత్రి వారికి చెప్పారు. 111 జీవో విషయంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకునే బాధ్యత తనదని, అధికారులు ఇబ్బందులు పెడితే తన దృష్టికి తీసుకు రావాలని మంత్రి కోమటిరెడ్డి చెప్పారు. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జి భీంభరత్, నాయకులు షాబాద్ దర్శన్, కొంపల్లి అనంతరెడ్డి, కీసరి సంజీవరెడ్డి, బొలిగిద్ద సత్యనారాయణ, మణయ్య, ముదిగొండ రవియాదవ్, రాఘవేందర్ యాదవ్ తదితరులు ఉన్నారు.



అవి ఇబ్రహీంపట్నానికి ముఖ్యమైన రోడ్లు. ఈ రోడ్ల పనులు పూర్తయితే స్థానికులకు ఎంతో ఉపయోగం. నాగార్జునసాగర్ వైపు నుంచి విజయవాడ వైపునకు వెళ్లడానికి దూరభారం తగ్గుతుంది. అంతేకాదు ఇబ్రహీంపట్నంలో ట్రాఫిక్ సమస్యకు కూడా పరిష్కారం లభిస్తుంది. గత సర్కారు హయాంలో ఇబ్రహీంపట్నం చౌరస్తా నుంచి ఆక్టోపస్ వెళ్లే రోడ్డు పనులకు రూ.60 కోట్లు మంజూరైనా స్థానిక సమస్యలతో అవి ముందుకు సాగలేదు. దీంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ప్రస్తుత ప్రభుత్వం, ఎమ్మెల్యే మళ్లీ ఈ రోడ్ల నిర్మాణంపై శ్రద్ధ చూపి వీటి నిర్మాణానికి పూనుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆక్టోపస్ రోడ్డు పనులను వెంటనే చేపట్టాలి



"నిత్యం రద్దీగా ఉండే ఇబ్రహీంపట్నం- ఆక్టోపస్ రోడ్డు పనులను వెంటనే చేపట్టాలి. గత ప్రభుత్వంలోనే రహదారి పూర్తి అవుతుందని భావించాం. ఈ రోడ్డు గుండా వాహనాలు వెళ్లాలంటేనే భయపడుతున్నాం. ప్రాధాన్యత కలిగిన ఈ రోడ్డుపై అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

- మొద్దు అంజిరెడ్డి, రైతు, శేరిగూడ

ఆక్టోపస్ రోడ్డు.. అధ్వానం!

- రూ.60 కోట్లు మంజూరైనా ముందుకు సాగని పనులు
- పొంచి ఉన్న ప్రమాదం.. పట్టింపులేని అధికారులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 24: ఇబ్రహీంపట్నం చౌరస్తా నుండి ఆక్టోపస్ వరకు రోడ్డు అధ్వాన్నంగా తయారై వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గత ప్రభుత్వంలో ఈ రోడ్డు విస్తరణకు మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ రూ.60 కోట్లు మంజూరు చేసినా పనులు చేపట్టలేకపోయారు. ఇబ్రహీంపట్నం టౌన్ ఐసీడీఎస్ కార్యాలయం నుండి టౌన్ చివరి వరకు రోడ్డుకు ఇరువైపులా కొంతమేర ఇళ్లను కూల్చడానికి పూనుకోగా కొందరు అడ్డుపడ్డారు. మరికొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో రోడ్డు పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఆక్టోపస్, ఎన్ఎస్‌జీలకు వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి అయినప్పటికీ దీనిపై అధికార యంత్రాంగం సరైన దృష్టి పెట్టలేకపోతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ రహదారిపై ఒక వాహనం వస్తే మరోటి క్రాస్ చేయడానికి కూడా వీలు లేకుండా ఉంది. అంతేగాక తరచూ ఈ రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నాయి. కాగా ఇదే రహదారిని కలిపే కృష్ణా పైప్‌లైన్ బైపాస్ రోడ్డు సుచిరా బార్ నుండి నాగన్‌పల్లి రోడ్డు వకు ఉన్న రహదారి కూడా అధ్వాన్నంగా ఉంది. ఈ రోడ్డు విస్తరణకు గతంలో హెచ్ఎండీఏ నుంచి రూ.3.50 కోట్లు మంజూరయ్యాయి. దీనికి టెండర్ ప్రక్రియ కొనసాగుతుండగానే అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. దీంతో ఆ పనులు కూడా అక్కడే ఆగిపోయాయి. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే నాగార్జునసాగర్ వైపు నుంచి విజయవాడ వైపునకు వెళ్లడానికి దూరభారం తగ్గుతుంది. అంతేగాక ఇబ్రహీంపట్నం టౌన్‌కు కొంతమేర ట్రాఫిక్ సమస్య కూడా తగ్గుతుంది. ఇప్పటికైనా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చొరవ తీసుకొని ఈ రెండు రహదారుల విస్తరణకు మరోమారు నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

కొత్త రెవెన్యూ చట్టంపై వర్క్‌షాప్

ఆర్వోఆర్ బిల్లుపై వివిధ రంగాలకు చెందిన వారి సూచనలు, సలహాలు

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 24 : తరచుగా తలెత్తుతున్న భూవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కాంగ్రెస్ సర్కారు మరో సంస్కరణకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా తీసుకొస్తున్న కొత్త రెవెన్యూ చట్టం, పేదలు, రైతులకి వరంగా మారనుంది. భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఆర్వోఆర్ చట్టం 2024 ముసాయిదాని తీర్చిదిద్దారు. రోజురోజుకీ మారుతున్న ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా చట్టంలో నిబంధనలు పొందుపర్చారు. ఈ మేరకు తెలంగాణ భూమి హక్కులు రికార్డు బిల్లు 2024 ముసాయిదా బిల్లుపై శనివారం కలెక్టరేట్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. రెవెన్యూ రిటైర్డ్ అధికారులు, న్యాయ నిపుణులతో విస్తృతంగా చర్చించారు. అధికారులు, న్యాయనిపుణులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, రైతుసంఘాల నేతలు, రైతుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ధరణి కమిటీ చైర్మన్ కోదండరెడ్డి, జిల్లా కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, బార్ అసోసియేషన్ సభ్యుడు కొండల్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా చేవెళ్ల ఆర్డీవో సాయిరాం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నూతన ప్రతిపాదిత రైట్స్‌ఆఫ్ రికార్డ్ (ఆర్వోఆర్)చట్టంలోని 20 సెక్షన్లకు సంబంధించిన ప్రతిపాదిత అంశాలను వివరించారు. ఈ సదస్సులో వివిధ వర్గాలకు చెందిన వారు చేసిన సూచనలు, సలహాలు ఇలా..

కొత్త చట్టంలో అప్పీళ్లకు అవకాశం

- ధరణి కమిటీ చైర్మన్ కోదండరెడ్డి

కొత్త చట్టంలో అప్పీళ్లకు అవకాశం కల్పిస్తారని ధరణి చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. నూతన చట్టంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2020లో ఏర్పాటు చేసిన చట్టంలో అప్పీళ్లకు అవకాశం లేదని, కొత్త చట్టంలో వాటికి స్థానం కల్పిస్తామని చెప్పారు. ఎక్కడైనా పొరపాటు జరిగితే సవరించే అవకాశం నూతన ప్రతిపాదిత చట్టంలో ఉందన్నారు. ప్రస్తుతం వేల సంఖ్యలో బోగస్ పాస్ పుస్తకాలు ఉన్నాయన్నారు. పాసు పుస్తకాలు ఉన్నవాళ్లకి భూములు లేవని, ఇలాంటివన్ని తొలగించి పారదర్శక చట్టాన్ని తీసుకువచ్చేందుకు చేస్తున్న ప్రయత్నంలో భాగంగా నూతన రెవెన్యూ చట్టంపై జిల్లా వ్యాప్తంగా అభిప్రాయాలను సేకరించి కొత్త చట్టం తెచ్చేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు.

నూతన చట్టంపై అవగాహన కలిగి ఉండాలి : కలెక్టర్ శశాంక

నూతన ఆర్వోఆర్ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ శశాంక అన్నారు. రైతులకు ఇంకా మెరుగైన భూ రికార్డుల విధానాన్ని తీసుకు వచ్చేందుకు 2020 చట్టం స్థానంలో 2024 చట్టం తెచ్చే క్రమంలో భాగంగా రైతుల నుంచి క్షేత్రస్థాయిలో సూచనలు, సలహాలు తీసుకుంటున్నామని, అందుకే నూతన చట్టంపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక, వేదికపై కోదండరెడ్డి, ఆర్డీవోలు

కొత్త చట్టంతో భూ సమస్యలకు పరిష్కారం

ప్రభుత్వం తీసుకు వచ్చిన కొత్త చట్టంతో భూ సమస్యలకు పరిష్కార మార్గం లభించనుంది. ధరణిలో మార్పులు తేవాల్సిన అవసరం ఉన్నందున ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతులకు అనుకూలమైన చట్టాలను తెస్తుంది. ఈ ముసాయిదా బిల్లు రైతులకు ఒక మంచి భవిష్యత్తును ఇవ్వబోతుంది.

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మాన్యువల్ రికార్డు ఉంటే బాగుంటుంది



ధరణిలో ఉన్న ప్రతిదీ మాన్యువల్‌గా ఉంటే బాగుంటుంది. ధరణిలో రికార్డు నిర్వహణ ఎంతో ముఖ్యం. హెచ్ఎండీఏ పరిధిలో సాదాబైనామాను అమలు చేయాలి. చాలావరకు కబ్జాలో ఒకరు ఉంటే.. రికార్డులో మరొకరు ఉంటున్నారు. దీంతో గొడవలు జరుగుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారం చూపాలి. సక్సేషన్ ఫీజు రూ. 2,500 ఉంది. ఈ ఫీజును తగ్గిస్తే బాగుంటుంది.

- సూరజ్ కుమార్, ఆర్డీవో

సైబర్ సెక్యూరిటీ సమస్య ఉంది



ధరణిలో ప్రధానంగా సైబర్ సెక్యూరిటీ సమస్య నెలకొంది. ఈ సమస్యను పరిష్కరించాలి. ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్వోఆర్ చట్టం ఎంతో బాగుంది. ఈ చట్టం పకడ్బందీగా అమలు కానుంది. రైతుల సమస్యలకు పరిష్కారం లభించనుంది.

- సాయిరాం, చేవెళ్ల ఆర్డీవో

చిన్న సమస్యలు మండల స్థాయిలోనే పరిష్కారం కావాలి



చిన్న సమస్యలు మండల స్థాయిలోనే పరిష్కారం కావాలి. తహసీల్దారు, ఆర్డీవోలకు అధికారాలు కల్పించాలి. సీలింగ్ భూములు పట్టా భూములుగా, పట్టా భూములు సీలింగ్ భూములుగా, వక్ఫ్ భూములుగా ధరణిలో తప్పులుగా నమోదయ్యాయి. నిషేధిత జాబితా నుంచి వీటిని తొలగించి సరిచేయాలి.

- ఉప్పల వెంకటేష్, మాజీ జడ్పీటీసీ

అమ్మిన రైతులు మళ్లీ అదే భూమిని అమ్ముతున్నారు



అమ్మిన రైతులు కొత్త పాస్‌బుక్‌ను సంపాదించి తిరిగి అదే భూమిని రెండోసారి ఇతరులకు అమ్ముతున్నారు. ఫస్ట్ కొన్న వ్యక్తి మ్యుటేషన్ చేసుకోకపోవడంతో.. రెండో వ్యక్తికి పట్టాదారు పాస్‌బుక్కులు వస్తున్నాయి. ఇలాంటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ఈ సమస్యలకు చెక్ పెట్టాలి. అప్పీల్ చేసుకునే వ్యక్తికి ఏదైనా నెంబర్‌ను కేటాయించాలి.

- బొక్క నర్సింహారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు.

అసెంబ్లీ వారీగా వర్క్‌షాప్‌లు నిర్వహించాలి

కొత్తం చట్టంపై అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. మీసేవ కేంద్రాల నిర్వాహకులకు ధరణిపై అవగాహన కల్పించాలి. మీసేవ అనుమతి ఒకరికి ఉంటే.. అందులో పనిచేసే వ్యక్తులు ఇతరులు ఉంటున్నారు. పోడు భూముల వివరాలను ధరణిలో చేర్చాలి.

- పగడాల యాదయ్య, రైతు, మంచాల

అన్‌రిజిస్టర్ డాక్యుమెంట్స్ పదం తొలగించాలి

కొత్త చట్టంలో పొందుపర్చిన అన్‌రిజిస్టర్ డాక్యుమెంట్స్ అనే పదాన్ని తొలగించాలి. రిజిస్టర్ డాక్యుమెంట్స్‌లో మ్యాపింగ్ ఇవ్వాలి. పాటిషన్‌లలో నెంబర్స్ వేయాలి. ధరణి బేస్డ్ రికార్డు ఏ సంవత్సరం నుంచి తీసుకుంటున్నారు అనే దానిపై స్పష్టత ఉండాలి.

- విశ్వనాథం, ఎన్జీవో ప్రతినిధి

ప్రతీ స్థాయిలో జ్యుడిషియల్ ఉండాలి

మండల, ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో జ్యుడిషియల్ విధానం ఉండాలి. దీనివల్ల కోర్టులకు భారం తగ్గే అవకాశం ఉంటుంది. కిందిస్థాయిలోనే భూ సమస్యలు పరిష్కారం అవుతాయి. ట్రిబ్యునల్, రాష్ట్ర, జిల్లా స్థాయిలో పెడితే బాగుంటుంది.

- మహేందర్, అడ్వకేట్

రాష్ట్ర స్థాయిలో పట్నం ఆర్టీసీ డిపోకు రెండో బహుమతి


మంత్రి, ఎండీల నుంచి పురస్కారం అందుకుంటున్న డీఎం వెంకటనర్సప్ప

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 24 : టీజీఆర్టీసీ రాష్ట్రస్థాయి ప్రగతి చక్రాల పురస్కారాల్లో ఇబ్రహీంపట్నం డిపో రెండో బహుమతి సాధించింది. శనివారం నగరంలోని ఆర్టీసీ కళా భవన్‌లో జరిగిన ఈ పురస్కారాల ప్రదానోత్సవంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా డిపో మేనేజర్ వెంకట నర్సప్ప రూ.2.5లక్షల చెక్కును, పురస్కారాన్ని అందుకున్నారు. ఇబ్రహీంపట్నం డిపో ఉద్యోగులు కృషితోనే ఈ పురస్కారం లభించినట్లు డీఎం తెలిపారు. గతేడాది ఈ డిపో మూడో బహుమతి(2లక్షల రూపాయల ప్రోత్సాహకం) సాధించింది. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు, ఆర్ఎం వరప్రసాద్, డిప్యూటీ ఆర్ఎంలు సుచరిత, జగన్ పాల్గొన్నారు.

మాద ప్రసాద్‌కు డాక్టరేట్


ప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్వికరెడ్డి

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 24 : హిమాయత్‌నగర్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తిచేసిన పటాన్‌చెరుకు చెందిన మాద ప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. డీమ్డ్ యూనివర్సిటీలో ప్రసాద్ కంప్యూటర్స్ సైన్స్‌లో 'స్టడీ ఆఫ్ ఎన్హాన్స్ అట్రిబ్యూట్ బేస్ట్ ఎన్క్రిప్షన్' అనే అంశంపై జగదీశ్వర్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. యూనివర్సిటీ వీసీ పురుషోత్తంరెడ్డి శనివారం వర్సిటీలో ప్రసాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్వికరెడ్డి, ప్రొఫెసర్లు క్రిస్టోఫర్, రవీందర్, సుందర్ రామ్, జగదీశ్వర్, పబ్లిక్ రిలేషన్ అధికారి రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఓరియెంటేషన్ డే కార్యక్రమంలో మాట్లాడుతూన్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

మంచి భవిష్యత్తుకు నిర్ణయాలు తీసుకోవాలి

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 24: ఇంజినీరింగ్ మొదటిదశలోనే విద్యార్థులు తమ మంచి భవిష్యత్తుకు పునాదులు వేసుకునేలా మంచి నిర్ణయాలు తీసుకుని ఆచరిస్తే లక్ష్యాలకు చేరతారని విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. అజీజ్‌నగర్ చౌరస్తాలోని విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కాలేజీలో నూతన విద్యార్థులకు శనివారం నిర్వహించిన ఓరియెంటేషన్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంజినీరింగ్ విద్య అంటే కేవలం గొప్ప కోసం కాదని, అందుకు అనుగుణంగా పరిశోధనలతో ఆవిష్కరణలపై దృష్టిపెట్టాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తమ కళాశాలతో నైపుణ్య విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, ఏవో వెంకటాచలం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశాభివృద్ధికి బాటలు వేయాలి



మాట్లాడుతున్న జేఎన్‌టీయూహెచ్ జీకే.విశ్వనాథ్

ఆదిభట్ల, ఆగస్టు 24: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన జీవనాన్ని అలవర్చుకోవాలని జేఎన్‌టీయూహెచ్, యూజీసీ డాక్టర్ జీకే విశ్వనాథ్ అన్నారు. బొంగ్లూర్ పరిధి విశ్వేశ్వరయ్య ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం నిర్వహించిన ఓరియెంటేషన్ డే కార్యక్రమానికి అతిథిగా వచ్చి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో మెలగాలన్నారు. లక్ష్యాలను సాధించాలంటే కఠోర సాధన చేయాలన్నారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి ఉత్తమ విద్యను అందిస్తున్నారని యాజమాన్యాన్ని అభినందించారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ కస్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తమ కళాశాల 20ఏళ్ల ప్రస్థానంలో ఉత్తమ ఫలితాలు సాధించిందని అన్నారు. న్యాక్ 'ఎ' గ్రేడ్ అటనమస్ హోదా పొందిందన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో శ్రీనాథ్‌చారి, సెక్రెటరీ శ్రీధర్‌రెడ్డి, కన్నయ్య శెట్టి, రాములు,ప్రిన్సిపల్ రమేష్, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్యం కోసం శ్రమిస్తేనే ఫలితాలు


మాట్లాడుతున్న జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 24 : విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యంకోసం శ్రమించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని జేఎన్‌టీయూ(హైదరాబాద్) రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్‌రావు అన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను ఎన్నో ఆశలతో ఉన్నత చదువులకు పంపుతున్నారని. వారి కలలను నిజం చేసే బాధ్యత పిల్లలదేనన్నారు. ఇబ్రహీంపట్నంలోని గురునానక్ విద్యా సంస్థల్లో బీటెక్ కోర్సుల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులు, తల్లిదండ్రులతో శనివారం జరిగిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంకిత భావం, క్రమశిక్షణతో ఏదైనా సాధించవచ్చన్నారు. పరిశ్రమలు, ఐటీ సంస్థలకు అవసరమైన కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలని విద్యార్థులకు సలహా చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఎల్ రిటైర్డ్ శాస్త్రవేత్త అశ్వినీకుమార్ సంగాంకర్, గురునానక్ విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ, ఎండీ డా.హెచ్.ఎస్.సైనీ, డైరెక్టర్ డా.ఎస్ శ్రీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు..

సాంకేతిక రంగాల్లో పట్టు సాధించాలి



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న సీఈవో

మొయినాబాద్, ఆగస్టు 24: మారుతున్న కాలనికి అనుగుణంగా ఇంజినీరింగ్ విద్యార్థులు సాంతికేక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఇన్ఫోసెప్ట్రాన్ ఆటోమిషన్ కో ఫౌండర్ సీఈవో వెంకటసుబ్రహ్మణ్యం, ఫోనిక్ టర్నల్ జనరల్ మేనేజర్ గుణేశ్ తెలిపారు. మండల పరిధి కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 13వ గ్రాడ్యుఏషన్ డేను నిర్వహించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. సాంతికేకరంగాల్లో మరింత ప్రతిభ చాటాలన్నారు. తల్లిదండ్రులకు గౌరవం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీన్ మంతెన నర్సయ్య, డైరెక్టర్లు రోహిత్, ప్రశాంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయం కిటకిట


లక్ష్మీవేంకటేశ్వరాలయంలో సత్యనారాయణస్వామి వ్రతాలు

చేవెళ్ల, ఆగస్టు 24: శ్రావణ శనివారం సందర్భాన్ని పురస్కరించుకొని చేవెళ్లలోని లక్ష్మీవేంకటేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. సాయంత్రం వరకు ఆలయాన్ని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించారు. అర్చకులు భక్తులందరికీ తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ వామనాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి 'ఎక్సలెన్స్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో స్థానం


గంజి శ్రీవైష్ణవికి ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ శశాంక

ఆమనగల్లు, ఆగస్టు 24 : ఆమనగల్లుకు చెందిన గంజి శ్రీవైష్ణవి అనే విద్యార్థినికి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ ఎక్సలెన్స్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కింది. వివేక విద్యాభారతి పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని శ్రీవైష్ణవి జూన్‌లో అంతర్జాతీయ ఎక్సలెన్స్ ఆఫ్ వరల్డ్ వారు నిర్వహించిన పోటీల్లో పాల్గొంది. 13నిమిషాల్లో ప్రపంచంలోని అన్ని దేశాల పేర్లు రాసి రికార్డు సృష్టించింది. 14ఏళ్ల వయస్సులో అందరిచే శభాష్ అనిపించుకుంది. శ్రీవైష్ణవికి పంజాబ్‌లోని జలంధర్‌లో గల అంతర్జాతీయ బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి ప్రశంసా పత్రం, పతకం అందింది. శ్రీవైష్ణవిని శనివారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శశాంక, డీఈవో సుశీందర్‌రావు అభినందించారు. వైష్ణవిని సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు. తెలంగాణ ఖ్యాతిని చాటడం అభినందనీయమని కలెక్టర్ కొనియాడారు. కరస్పాండెంట్ జి.శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ మహమూద్‌లను అధికారులు అభినందించారు. కార్యక్రమంలో శ్రుతిలయ కల్చరల్ అకాడమీ ఛైర్మన్ చిత్తరంజన్, ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివలింగం, పీఈడీ భాస్కర్ రెడ్డి, టీచర్లు, స్కూల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ రద్దుపై చిత్తశుద్ధి కరువు

ఉత్తర్వులు జారీ చేయాలంటున్న రైతులు



ఫార్మాసిటీ కోసం సేకరించి ప్రీ కాస్టింగ్‌తో గోడలు నిర్మించిన టీజీఐఐసీ అధికారులు

యాచారం ఆగస్టు 24: యాచారం, కందుకూరు మండలాల పరిధిలో ఏర్పాటు చేస్తామన్న ఫార్మాసిటీని ప్రభుత్వం వెంటనే రద్దుచేయాలని రైతులు కోరుతున్నారు. కాలుష్యరహిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటున్నారు. కందుకూరు మండలం బేగరికంచలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదంటున్నారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం ఫార్మాసిటీ రద్దుపై ఎందుకు ప్రకటన చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఫార్మాసిటీ రద్దయినట్టా? లేదా? అని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద, పిల్లిపల్లి, గొల్లగూడ గ్రామాల రైతులు చర్చించుకుంటున్నారు. కాలుష్య రహిత కంపెనీలు ఏర్పాటుకు తాము సహకరిస్తామంటున్నారు. 4వేల ఎకరాల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ హబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ఫార్మాసిటీని రద్దు చేసి 9ఏళ్లుగా నిషేధిత జాబితాలో ఉన్న భూములపై నిషేధాన్ని ఎత్తివేయాలని కోరుతున్నారు. కొత్తగా భూసేకరణ చేపట్టకుండా ముఖ్యమంత్రి టీఎస్ఐఐసీ అధికారులను ఆదేశించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఫార్మాసిటీకి యాచారం మండలంలో 4వేల ఎకరాల పట్టాభూములు, 4వేల ఎకరాల అసైన్డ్ భూములను సేకరించారు. నానక్‌నగర్ మేడిపల్లిల మధ్య మట్టి రోడ్డు వేశారు. ప్రభుత్వం వచ్చేందుకు 4నెలల ముందే రోడ్డు నిర్మాణ పనులు నిలిపేశారు.

భూములు మావి.. కంపెనీలు కందుకూరు మండలానికా?

ఫార్మాసిటీ కోసం ఎక్కువ భూసేకరణ యాచారం మండలంలో చేశారు. 8వేల ఎకరాల భూములు తీసుకున్నారు. 4వేల ఎకరాల అసైన్డ్ భూమి తీసుకోవడంతో వందలాది మంది రైతులు గుంట భూమి లేకుండా పోయింది. భూములు పోయినా ప్రభుత్వం ఏదో ఒక ఉపాధి కల్పిస్తుందని భావించిన రైతుల ఆశలు వమ్ముయ్యాయి. కందుకూరు మండలంలో కేవలం 3వేల ఎకరాలే సేకరించారు. అయితే పరిశ్రమలు, సంస్థలన్నీ అక్కడకే తరలిస్తున్నారని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుర్మిద్ద, తాటిపర్తి, నానక్‌నగర్ గ్రామాల్లో కాలుష్యరహిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఫార్మాసిటీ రద్దు కాదు : బీఆర్ఎస్

ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 'నిమ్జ్' హోదా పొందిన ఫార్మాసిటీ రద్దు కాదని, ఎట్టి పరిస్థితుల్లో ఇక్కడ ఫార్మాకంపెనీలుర్పాటవవుతాయని బీఆర్ఎస్ నాయకులు అంటున్నారు. మున్ముందు తమ పార్టీ ప్రభుత్వం వస్తే ఫార్మాసిటీ ఏర్పాటు ఖాయమని చెబుతున్నారు. ఫార్మాసిటీని రద్దుచేసే అధికారం రాష్ట్రానికి లేదని, ఇది కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కంపెనీలు ఏర్పాటవుతాయని అంటున్నారు. ఇది అధికారులకు తెలుసని, మిగిలిన భూసేకరణ కూడా చేస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు హక్కులు కల్పించాలి



పట్టాభూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలి. పట్టాభూములు అమ్ముకునేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. భూమి వివరాల్లో టీజీఐఐసీకి బదులు రైతుల పేర్లను నమోదు చేసేలా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించాలి. కొత్తగా భూసేకరణ చేపటొట్టుద్దు.

\- శ్రీకాంత్‌నాయక్, కుర్మిద్ద తండా

ఫార్మాసిటీని రద్దుచేయాలి



ఫార్మాసిటీ కోసం గత ప్రభుత్వం పేదల భూములను తీసుకొని వీధిన పడేసింది. ఈ ప్రాంతంలో ఫార్మాసిటి రద్దు చేయాలి. ఫార్మాసిటి రద్దు చేసి కాలుష్యం లేని ఐటీ కంపెనీలతో పాటు స్కిల్ యునివర్సిటీ. హెల్త్ టూరిజం హబ్‌ల ఏర్పాటుకు తమకభ్యంతరంలేదు. నిషేధిత జాబితాలో ఉన్న పట్టాభూములపై రైతులకు అన్ని హక్కులు కల్పించాలి. కొత్తగా భూసేకరణ చేయకపోగా సెంటు భూమి లేని నిరుపేదలకు భూములు పంచి ఆదుకోవాలి.


\- మహిపాల్‌రెడ్డి, నానక్‌నగర్

ఉద్యోగులకు బదిలీలు తప్పవు


బదిలీపై వెళ్లిన అధికారులను సన్మానిస్తున్న కలెక్టర్ శశాంక

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 24: ప్రభుత్వ ఉద్యోగికి సర్వీస్‌లో బదిలీ తప్పదని రంగారెడ్డి కలెక్టర్ శశాంక తెలిపారు. బదిలీపై రంగారెడ్డి జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లిన జిల్లా అధికారులకు శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతీమాసింగ్, డీఆర్వోలతో కలిసి సన్మానాలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇటీవల జిల్లా నుంచి బదిలీపై ఏడుగురు జిల్లా అధికారులు ఇతర జిల్లాలకు వెళ్లడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ అనేది ఉంటుందన్నారు. జిల్లాతో ఉన్న మంచి జ్ఞాపకాలతో వెళుతున్నారని, ఎన్నికల సమయంలో, ప్రముఖుల పర్యటనలో జిల్లా యంత్రాంగానికి సహకరం అందించడం వలన ఎన్నికలను విజయవంతంగా నిర్వహించమన్నారు. ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. బదిలీ అయిన అధికారులు ఈ జిల్లాలోని పనిచేసిన విధంగానే వెళ్లిన చోట కూడా పనిచేయాలన్నారు. బదిలీ అయిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి నీరజ గాంధీ, డీసీసీవో ధాత్రిదేవి, పౌర సంబంధాల అధికారి పద్మశ్రీ, సివిల్ సప్లయీస్ డీఎంవో విజయలక్ష్మిలను సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్వో సంగీత, ఏవో సునిల్, ఆర్డీవోలు సూరజ్‌కుమార్, అనంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వేణుమాదవ్, డీఆర్డీఏ డీపీ శ్రీలత, డీపీవో సురేష్ మోహన్, వ్యవసాయ శాఖ అధికారి నర్సింహరావు, ఉద్యాన శాఖ అధికారి భాగ్యలక్ష్మి, డీసీసీవో సుధాకర్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, సంక్షేమ శాఖ అధికారి పద్మజారమణ, సివిల్ సప్లయీస్ అధికారి మనోహర్‌రాథోడ్, ఎస్ఐసీ అధికారి స్వర్ణలత పాల్గొన్నారు.

ఈ దారి.. పచ్చదారి



పచ్చదనంతో అహ్లాదకరంగా ఉన్న నేదునూరు రోడ్డు వాహనదారులను, ప్రయాణికులను, చూపరులను ఆకట్టుకుంటోంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నుంచి గ్రామానికి సుమారు 4కిలోమీటర్ల దూరం రోడ్డు వెంట మాజీ సర్పంచ్ కాసుల రామక్రిష్ణారెడ్డి ప్రోత్సాహంతో మొక్కలు మొక్కలు నాటించారు. పూల మొక్కలు, ఏపుగా పెరిగే ఇతర మొక్కలు నాటించారు. మొక్కలు పెరిగి వృక్షాలై ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

\- కందుకూరు, ఆగష్టు 24

అడవుల అభివృద్ధిలో బీట్ ఆఫీసర్ల పాత్ర కీలకం

జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్


అనంతగిరికి శిక్షణలో భాగంగా వచ్చిన బీట్ ఆఫీసర్లు

వికారాబాద్, ఆగస్టు 24: అడవుల అభివృద్ధిలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల పాత్ర కీలకమని జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. తెలంగాణ ఫారెస్ట్ అకాడమిలో శిక్షణ పొందుతున్న 33 మంది బీట్ ఆఫీసర్లు శనివారం శిక్షణలో భాగంగా అనంతగిరిని సందర్శించారు. అనంతగిరి రిజర్వ్ ఫారెస్ట్‌లో అభివృద్ధి చెందుతున్న టూరిజం పార్కింగ్, ట్రెకింగ్ ఏరియా, వాచ్ టవర్, గ్రాస్ ల్యాండ్ ఏరియా వంటి ప్రాంతాలను స్టడీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీట్ ఆఫీసర్లపై ఒత్తిడి ఎక్కువగా ఉంటుందన్నారు. వృత్తి జీవితంలో ఉన్న ఒత్తిళ్లను అధిగమించడానికి సమాజంలోని వ్యక్తులతో, సహచరులతో, ఇతర అధికారులతో ఆరోగ్యకరమైన సంబంధాలు నెలకొల్పుకోవాలని సూచించారు. అడవుల ప్రత్యేకతను బీట్ ఆఫీసర్ గుర్తించి, వాటిని సంరక్షించాలన్నారు. ప్రస్తుతం దేశంలో జనాబా పెరుగుదలతో ఫారెస్ట్ భూములపై తీవ్రమైన ఒత్తిడి ఉందని దీనిని దృష్టిలో ఉంచుకొని తమ విధులను నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్యామ్ కుమార్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అరుణ, తెలంగాణ ఫారెస్ట్ అకాడమి అసిస్టెంట్ డైరెక్టర్ సుభాష్ చంద్ర యాదవ్ పాల్గొన్నారు.

ధారూరు మార్కెట్‌లో పెసర బీట్లు

ధారూరు, ఆగస్టు 24: ధారూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం సాయంత్రం పెసర పంట ఉత్పత్తులకు బీట్లు నిర్వహించారు. మార్కెట్‌కు 1161 సంచుల పెసర్లు రాగా క్వింటాల్‌కు రూ.5,650ల నుంచి రూ.7,450ల వరకు ధర పలికింది. పసుపు 20 సంచులు రాగా క్వింటాలుకు రూ.8,800ల నుంచి 12వేల వరకు ధర పలికిందని మార్కెట్ కమిటీ సహాయ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు. పెసర్లు 580.5 క్వింటాళ్లు, పసుపు 12 క్వింటాళ్ల క్రయవిక్రయాలు జరిగాయని తెలిపారు.

29న పంచాయతీ దుకాణాల వేలం

పూడూరు, ఆగస్టు 24: మండలంలోని మన్నెగూడ పంచాయతీకి చెందిన ఎనిమిది దుకాణాలను అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు ఈనెల 29న బహిరంగ వేలం నిరహిస్తున్నట్లు పంచాయతీ అధికారులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు నిర్ణీత రుసుము రూ.500లు చెల్లించి దరఖాస్తు ఫారం పొందాల్సి ఉంటుందని తెలిపారు. వేలంలో పాల్గొనే వ్యక్తి రెండు ఫొటోలు, ఆధార్‌కార్డు, ఓటరు కార్డు, రేషన్ కార్డు ఏదైనా ఒకటి దరఖాస్తుతోపాటు జత చేయాల్సి ఉంటుంది. ఆస్తి విలువ ధ్రువీకరణ పత్రం, పన్నుల చెల్లింపుల నో డ్యూ సర్టిఫికెట్, వేలంలో పాల్గొనే వారు రూ.30వేలు మొత్తన్ని ఏదైనా జాతీయ బ్యాంకులో టీఎస్-బీపాస్ అకౌంట్ జీపీ మన్నెగూడ పేరున డీడీ వేలానికి ఒకరోజు ముందు అంటే 28వ తేదీ సాయంత్రం 5గంటల వరకు అందజేయాలి. ఒక్కషాప్‌నకు ఒక్కొక్క డీడీ విడిగా దరఖాస్తు సమర్పించాలి. వేలంలో దుకాణం పొందిన వారు రూ.100ల బాండ్ పేపర్‌పై షరతులతో కూడిన ఒప్పందం సమర్పించడంతోపాటు తదితర షరతులు, నిబంధనలు వర్తిస్తాయని తెలిపారు. ఆసక్తిగలవారు పంచాయతీలో వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.


రంగంపల్లిలో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

పరిగి, ఆగస్టు 24: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పరిగి మండల మాజీ వైఎస్ ఎంపీపీ కావలి సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని రంగంపల్లి గ్రామంలో మండల పరిషత్ నిధుల నుంచి అండర్ డ్రైనేజీ పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రధానంగా సీసీరోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాలు, నీటి సరఫరాకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కె.సురేష్‌చందర్‌రెడ్డి, వీరారెడ్డి, రాజేందర్‌రెడ్డి, శేషిరెడ్డి, కృష్ణ, వెంకటయ్య, స్వామి అనంతయ్య, హనుమంతు, నారాయణరెడ్డి, సత్తయ్య పాల్గొన్నారు.


ధారూరులో బోర్‌వెల్ డ్రిల్లింగ్ పనులను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు

ధారూరులో ఎస్‌డీఎఫ్ నిధులతో బోర్ డ్రిల్లింగ్

ధారూరు, ఆగస్టు 24: ధారూరు పంచాయతీలో తాగునీటి సమస్యను శాశ్వతంగా నివారించేందుకు శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ మంజూరు చేసిన ఎస్‌డీఎఫ్ నిధులతో శనివారం బోర్‌డ్రిల్లింగ్ పనులను శనివారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. రెండు బోర్లు డ్రిల్లింగ్, పంప్‌సెట్లు బిగింపునకు ఎస్‌డీఎఫ్ ద్వారా రూ.5లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో ధారూర్‌లోని పాత కమ్యూనిటీ హాల్ పక్కన ఉన్న మిషన్ భగీరథ తాగునీటి ట్యాంకు వద్ద బోర్‌డ్రిల్లింగ్ చేశారు. మిషన్ భగీరథ నీటిసరఫరాలో అంతరాయం కలిగితే ఈ బోర్‌ద్వారా నీటిని ట్యాంకులో నింపి గ్రామానికి తాగునీరు సరఫరా చేయనున్నారు. కాగా ధారూరు పంచాయతీ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు రూ.70.20 లక్షలు మంజూరు చేయించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు స్థానిక కాంగ్రెస్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అంజానాయక్, నాయకులు బుజ్జయ్యగౌడ్, కిరణ్‌కుమార్, బాబాఖాన్, బి.అంజయ్య, ముజాఫర్, అశోక్‌ముదిరాజ్, మల్లికార్జున్, ఎస్.అశోక్, ఇబ్రహీం, లింగం, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన రంగంలో ముందంజలో భారత్



డీఆర్డీవో సైంటిస్ట్ ప్రవీణ్ కుమార్‌ను సన్మానిస్తున్న ఎంఆర్‌సీఈ కళాశాల యాజమాన్యం

మేడ్చల్ టౌన్, ఆగస్టు 24: కొత్త పరిశోధనలో భారత్ ముందంజలో ఉందని డీఆర్డీవో సైంటిస్టు డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో శనివారం నిర్వహించిన స్పేస్ డే కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. మిజాయిల్ తయారీ పరిశోధన రంగంలో దేశం గణనీయంగా అభివృద్ధి చెందిందన్నారు. భవిష్యత్తులో కొత్త ప్రయోగాలతో మిజాయిల్ రంగంలో కొత్త ఆవిష్కరణలు చేయనుందన్నారు. ఈ మధ్య కాలంలో సాంకేతిక రంగంలో దేశంలో సాధించిన పలు అంశాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.అశోక్, హెచ్‌వోడీ డాక్టర్ సంపత్ కుమార్, కన్వీనర్లు డాక్టర్ వంశీ, శివకుమార్, పాషా పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి


పరిగి సీడీపీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

పరిగి, ఆగస్టు 24: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పరిగి సీడీపీవోకు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మినీ నుంచి మెయిన్ కేంద్రాలుగా మారిన టీచర్లకు జూలై మాసం వేతనాలు మెయిన్ టీచర్లతో సమానంగా ఇవ్వాలని కోరారు. గత మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్ల విషయంలో ప్రభుత్వం మాటమారుస్తోందన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మంజుల, స్వరూప, దేవి, విజయ, రుక్కిబాయి, శాంతి, బుజ్జిబాయి, రేణుక, సునీత, లలిత పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సురేందర్

శంకర్‌పల్లి/చౌదరిగూడ, ఆగస్టు 24: 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సురేందర్ తెలిపారు. శంకర్‌పల్లి మండల పరిషత్‌లో శనివారం బూత్ లెవల్ అధికారులు, బూత్‌లెవల్ సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, యువతీ యువకులు ఓటును నమోదు చేసుకోవాలని అన్నారు. ఇంటింటికి తిరిగి చనిపోయిన వారి పేర్లను తొలగించాలని ఆదేశించారు. ఓటరు లిస్టులో మార్పులు చేర్పులు చేసుకొనేందుకు సైతం దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. డిటీ ప్రియాంక తదితరులు ఉన్నారు. ఓటరు జాబితాల్లో తప్పులులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలవాలని చౌదరిగూడ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులు, బీఎల్వోలకు సూచించారు. గాలిగూడ, వీరన్నపేట్ గ్రామాల్లో ఓటర్ల జాబితా మెర్జింగ్ విధానాన్ని, పల్లె ప్రకృతి వనం, పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉన్న ఓటర్ల జాబితాను అనుసరించి వార్డుల వారీగా లిస్ట్ రూపొందించాలన్నారు. ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో హన్మంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు షఫీ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలి

కేశంపేట, ఆగస్టు 24: ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలని హాస్టల్ వార్డెన్లకు ఎంఈవో, ప్రత్యేకాధికారి రాజారత్నం సూచించారు. శనివారం కొత్తపేట సంక్షేమ వసతి గృహం, కేశంపేటలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని ఆయన అకస్మికంగా పరిశీలించారు. కొత్తపేట హాస్టల్‌లో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని వార్డెన్ రాధాకృష్ణకు సూచించారు. హాస్టల్ పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల కస్తూర్బాగాంధీ విద్యాలయం విద్యార్థినులు అప్రమత్తం చేయాలని పాఠశాల ప్రత్యేకాధికారి గౌసియాబేగంకు ఎంఈవో సూచించారు. అలాగే కస్తూర్బాగాంధీ ఆవరణలో కళాశాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మంజూరైన పనులను వెంటనే పూర్తిచేయించాలని కోరారు. ఆయన వెంట ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, ఏపీఎం కిష్టయ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

● వేషధారణల్లో అలరించిన చిన్నారులు



ఆమనగల్లులో ఉట్టి కొడుతున్న చిన్నారులు

చేవెళ్ల/షాబాద్/చౌదరిగూడ/ఆమనగల్లు/కడ్తాల్/కొత్తూర్/కొందుర్గు, ఆగస్టు 24: చేవెళ్ల మండలంలోని పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలతో అలరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమాలు చేపట్టారు. షాబాద్ మండలం నాగర్‌గూడ అక్షర టాలెంట్ స్కూల్‌లో చిన్నారులు శ్రీకృష్ణులు, గోపికల వేషధారణలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కరస్పాండెంట్ రాజుగౌడ్ మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడు జగత్‌కు గురువు, ధర్మం వైపు నిలబడి అర్జునుడికి ఉపదేశం చేశాడన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలన్నారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లేడ్ చౌదరిగూడలోని ఉన్నత పాఠశాలలో ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించే బాలల సభలో భాగంగా విద్యార్థులకు లీడర్‌షిప్, ప్రజాప్రతినిధుల బాధ్యతలపై ఉపాధ్యాయులు వివరించారు. జీహెచ్ఎం సునీత మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యాక్రమంలో టీచర్లు శంకర్‌గౌడ్, శ్రీనివాస్ కుషాల్, నరేందర్, లావణ్య, కల్యాణి, వాణి, భానుచంద్ర, సుశీల, పార్వతి, పీఈటీ శిరీష పాల్గొన్నారు. ఆమనగల్లులోని లిటిల్ స్కాలర్స్, లిటిల్ స్కాలర్స్ టెక్నో స్కూళ్లలో జన్మాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బాలబాలికలు చిన్ని కృష్ణుడు, గోపిక, రాధల వేషధారణలతో ఆకట్టుకున్నారు. రాధాకృష్ణుల జీవిత చరిత్రను ఉపాధ్యాయులు వివరించారు. లిటిల్ స్కాలర్స్ పాఠశాల చైర్మన్ అల్లాజిగౌడ్, అకడమిక్ అడ్వైజర్ సుదర్శన్‌రెడ్డి, కరస్పాండెంట్ సుజాతరెడ్డి, డైరెక్టర్ సావిత్రి, ప్రిన్సిపాల్ శ్రీశైలం, టీచర్లు రేవతి, రమాదేవి, మాధురి, సరిత, కల్పన, విజయ, విజయభార్గవి, నిఖిత, కావ్య, లావణ్య, వినయ్, శర్మ, చెన్నయ్య, హైమవతి, శ్రీజన్య, మమత, తేజ, అలేఖ్య, మధుశ్రీ,యాధ్య, శ్రీశైలం, లక్ష్మి, మేఘన, స్వప్న, సాయిప్రియ, రాజేశ్వ రి, నందిని, అనూష, సోని, పాల్గొన్నారు. కడ్తాల్ సమీపంలోని పార్చ్యూన్ బటర్ ఫ్లై స్కూల్‌లో జన్మాష్టమి వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ సంజీవ్ నాంపల్లి, వైస్ ప్రిన్సిపల్ రంగారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కొత్తూర్‌లోని వెంకటరమణ పాఠశాలలో విద్యార్థులు శ్రీకృష్ణుడి వేషధారణలతో ఆకట్టుకున్నారు. పాఠశాల చైర్మన్ వీరమోని దేవేందర్‌ముదిరాజ్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు విద్యతో పాటు, అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బీవీ.రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కొందుర్గులోని న్యూ గీతాంజలి పాఠశాలలో గోకులాష్టమిని నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ బాల్‌రాజ్, ఉపాధ్యాయులు మహేందర్, మహేశ్, వీరేష్, సత్తయ్య, అశోక్, ఆసియా, మంజుల, కల్పన, హైమవతి తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్లలో చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణ



కొత్తూరు: శ్రీ వెంకటరమణ పాఠశాలలో రాధా, కృష్ణుల వేషధారణల్లో చిన్నారులు



చౌదరిగూడలోని పాఠశాలలో ఉట్టి కొడుతున్న చిన్ని కృష్ణులు



షాబాద్: నాగర్‌గూడ అక్షర టాలెంట్ స్కూల్‌లో కృష్ణుడు, రాధ వేషధారణలో చిన్నారులు



కడ్తాల్ : బటర్ ఫ్లై స్కూల్‌లో రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు

వాహనాన్ని ఢీకొని యువకుడి దుర్మరణం

యాచారం, ఆగస్టు 24:నడిరోడ్డుపై ఆగి ఉన్న బొలెరో వాహనాన్ని బైక్ ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న యువకుడు దుర్మరణం చెందగా మరో యువకుడు గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు .. శనివారం ఉదయం యాచారం మండలం మాల్‌కు చెందిన శివకోటి(21), అతడి చిన్నాన్న కొడుకు విష్ణుతో కలిసి మంచాల మండలం నోములకు బైక్‌పై బయల్దేరారు. నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారిపై మెట్ట వ్యవసాయ పరిశోధన కేంద్రం వద్ద నడిరోడ్డుపై బొలెరో వాహనం నిలిపి ఉంది. ఇది యువకులు గమనించకుండా వేగంగా బొలెరోను వెనక నుంచి ఢీకొట్టారు. దీంతో శివకోటి అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన విష్ణును పెట్రో మొబైల్-1 పోలీసులు ఇబ్రహీంపట్నంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

బస్సు దిగుతూ పడి వృద్ధురాలికి గాయాలు

కేశంపేట, ఆగస్టు 24: ఆర్టీసీ బస్సు నుంచి దిగే క్రమంలో ఓ వృద్ధురాలు జారిపడి తీవ్రంగా గాయపడింది. గ్రామస్తుల వివరాల మేరకు.. కాకునూర్‌కు చెందిన సత్తమ్మ(77) శనివారం షాద్‌నగర్ వెళ్లి బస్సులో తిరిగి వస్తుండగా కేశంపేటలోని వైఎస్సార్ చౌరస్తాలో బస్సు దిగుతూ మెట్లపై నుంచి జారిపడింది. ఇది గమనించని డ్రైవర్ బస్సును ముందుకు నడపడంతో వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. సత్తమ్మకు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

నందిగామ, అగస్టు 24: ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో గణేష్ చవితి ఉత్సవాలు జరుపుకోవాలని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అన్నారు. శనివారం నందిగామలో ఆయన గణేష్ ఉత్సవ కమిటీల శాంతి సమావేశాన్ని మతపెద్దలు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలతో నిర్వహించారు. మండపాలకు అనుమతి తీసుకోవాలని, మండపాల వద్ద పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అన్ని పండుగలకు అన్ని మతాల వారు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ గోపాలక్రిష్ణ, మాజీ ఎంపీటీసీలు కొమ్ముక్రిష్ణ, చంద్రపాల్‌రెడ్డి, దేపల్లి కుమార్‌గౌడ్, నాయకులు శ్రీశైలం, అంజయ్య, ఆయా గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువకులు, మతపెద్దలు పాల్గొన్నారు.

కొత్తూర్: గణేష్ ఉత్సవాలను శాంతియూత వాతావరణంలో జరుపుకోవాలని కొత్తూరు ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు అన్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన మండప నిర్వాహక కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పండుగ నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు లింగంనాయక్, శ్రీరాములుయాదవ్, బాబులాల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కరాటేలో బాలికకు బంగారు పతకం



గోల్డ్ మెడల్ అందుకుంటున్న బాలిక జ్ఞానతేజ

షాబాద్, ఆగస్టు 24 :లక్ష్మారావుగూడకు చెందిన మేకల జ్ఞానతేజ మొయినాబాద్ మండలం కాకతీయ సుజాత స్కూల్‌లో 3వ తరగతి చదువుతోంది. చదువుతోపాటు గ్లోయింగ్ సోతకన్ కరాటే అకాడమీలో బాలిక శిక్షణ పొందుతోంది. శనివారం బెంగలూరులో జరిగిన ఓపెన్ శివమొగ్గ 2024 ఐదో ఇంటర్‌నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో బాలిక గోల్డ్ మెడల్ సాధించింది. ప్రిన్సిపాల్, కరాటే మాస్టర్ సియాన్ కె.సుధాకర్, తల్లిదండ్రులు, ప్రభావతి-విజయ్‌శేఖర్, బంధువులు శ్రీనివాస్-సరిత, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు ఆసక్తి ఉన్న ఇతర అంశాల్లోనూ శిక్షణ ఇప్పించి ప్రోత్సహించాలన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



అధికారికి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

మొయినాబాద్, ఆగస్టు 24: మండల పరిధి సజ్జన్‌పల్లిలో పేదల ఇండ్లస్థలాలను రియల్‌ఎస్టేట్ బ్రోకర్లు కబ్జాకు యత్నిస్తున్నారని, వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద గ్రామస్తులతో కలిసి ధర్నా చేసి తహసీల్దార్‌కు, పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ... సజ్జన్‌పల్లిలో 2002లో ప్రభుత్వం 72 మందికి ఇండ్ల పట్టాలు ఇచ్చిందన్నారు. ఆ స్థలాల్లో కొందరు ఇండ్లు ఇందిరమ్మ నిర్మించుకున్నారన్నారు. ఇటీవల రియల్ ఎస్టేట్ బ్రోకర్లు ఖాళీ స్థలాలను దౌర్జన్యంగా దున్నుతున్నారని చెప్పారు. కబ్జాకు పాల్పడుతున్న ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్, వెంకటయ్య, రవీందర్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో బోనాల సంబరాలు



బోనాలతో ఆలయానికి తరలుతున్న మహిళలు

కడ్తాల్, ఆగస్టు 24 : మండల కేంద్రంలో గౌడసంఘం ఆధ్వర్యంలో శనివారం కాటమయ్య బోనాలు జరుపుకున్నారు. కంఠమహేశ్వర స్వామి ఆలయాన్ని తోరణాలు, పుష్పాలతో అలంకరించారు. సాయంత్రం మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించా రు. కార్యక్రమంలో సంఘం నాయకులు మాలె మల్లేశ్‌గౌడ్, యాదయ్యగౌడ్, కేశవులుగౌడ్, శ్రీరాములు, శ్రీను, రమేశ్, శివ, జంగయ్య, చంద్రయ్యగౌడ్, గణేశ్, శేఖర్, రమేశ్, సత్యం, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్,మాజీ ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ జి.శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, పోచమ్మ ఉత్సవ కమిటీ చైర్మన్ సత్యంయాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రాంచందర్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, ప్యాక్స్ డైరెక్టర్ వెంకటేశ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.



ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు

ఆరోగ్యశ్రీపై అవగాహన కల్పించండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, ఆగస్టు 24 : అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆరోగ్యశ్రీ పథకం కల్పతరువు లాంటిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో షాద్‌నగర్ నియోజకవర్గ పరిధి ఫరూఖ్‌నగర్, నందిగామ, కేశంపేట, చౌదరిగూడ, కొందుర్గు, షాద్‌నగర్ పట్టణానికి చెందిన 48మంది లబ్ధిదారులకు రూ.17 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీపై పార్టీ కార్యకర్తలు ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ పథకం కింద రూ.10లక్షల వరకు వైద్యం చేయించుకునే అవకాశముందన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ కింద వైద్యానికయ్యే ఖర్చులో అర్థ శాతం డబ్బులు కూడా మంజూరు కావన్నారు. ఆరోగ్యశ్రీపై అవగాహన లేకే రోగులంతా సీఎంఆర్ఎఫ్ కోసం తనవద్దకు వస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రామ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

హైడ్రా చర్యలు అభినందనీయం

● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు



మాట్లాడుతున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 24 : చెరువుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన హైడ్రా తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు తెలిపారు. హైదరాబాద్‌లోని తుమ్మిడి చెరువులోని అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేతలపై బక్కని నర్సింహులు స్పందించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధిని ఆకాంక్షించి, పోరాడి సాధించుకున్న తెలంగాణలో అక్రమ నిర్మాణాలు, కబ్జాలు పెరిగాయని అన్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని చెరువులు, కుంటలు, పాటు కాలువలు, నదీ పరివాహక ప్రాంత స్థలాలు కబ్జాలకు గురై అక్రమ నిర్మాణాలు వెలిశాయని గుర్తుచేశారు. ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులతో పాటు సినీ నటులు కూడా చెరువు స్థలాలను అక్రమించుకుని, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తే ఎలా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తే, ప్రస్తుత ప్రభుత్వం చెరువులను పరిరక్షించాలన్న మంచి ఆలోచనతో వేసిన హైడ్రాకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. కోర్టులు కూడా ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, పర్యావరణ సమతుల్యం కోసం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్మాణాలు పెరిగి ఇప్పటికే కాంక్రీట్ జంగల్‌గా మారిన హైదరాబాద్‌లో ఉన్న చెరువులను పరిరక్షించుకోకపోతే భవిష్యత్తు తరాలు క్షమించవని ఈ సందర్భంగా బక్కని అభిప్రాయపడ్డారు.

వేంకటేశ్వరుడికి ఉద్యాన వనం

● ఆలయ భూమిలో ఫల, పుష్ప మొక్కలు

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 24: శ్రీ వేంకటేశ్వరస్వామికి ఉద్యాన వనం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు షాద్‌నగర్‌కు చెందిన న్యాయవాది, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బి.జగన్‌మోహన్‌రెడ్డి. వేంకటేశ్వర స్వామి ఆలయ భూమిలో ఫల, పుష్ప వనాల ఏర్పాటుకు జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఆలయం ఉత్తరం వైపు ఈశాన్యంలో ఎత్తుగా ఉన్న మట్టి తవ్వి, పడమర వైపు పోయించారు. ఎకరం పొలాన్ని చదును చేసి, డ్రిప్ వేయించారు. ఆ స్థలంలో శనివారం మామిడి, సపోట, జామ, కొబ్బెరి, బత్తాయి, నిమ్మ, సీతాఫలం తదితర రకాల 160 మొక్కలను నర్సరీల నుంచి తెప్పించి నాటించారు. మరో అర ఎకరం పైగా ఉన్న స్థలంలో వివిధ రంగులు, వివిధ రకాల పూల మొక్కలను నాటిస్తామన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైంది



కొత్తూర్: బదిలీపై వెళ్తున్న టీచర్లను సన్మానిస్తున్న గ్రామస్తులు

కొత్తూర్/షాబాద్/కొందుర్గు, ఆగస్టు24: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎల్లారం శేఖర్‌రెడ్డి, ఎస్కే. ఖాజా అన్నారు. కొత్తూర్ మండలం సిద్ధాపూర్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు మణివర్ధన్‌రెడ్డి, టీచర్లు రజితమ్మ, సరిత, ఉషారాణి, ప్రసాద్, మల్లికార్జున్, వెంకటేష్, అక్మల్‌పాషా ఇటీవల బదిలీ అయ్యారు. వారికి శనివారం పాఠశాల ఆవరణలో సన్మానాన్ని నిర్వహించారు. కష్టించి పనిచేసే ఉపాధ్యాయులకు ఎక్కడికి వెళ్లినా గుర్తింపు ఉంటుందన్నారు. సిద్ధాపూర్ విద్యార్థులకు మంచి బోధన అందించి తీర్చిదిద్దిన హెచ్ఎం, టీచర్ల కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రఘపాల్, స్వామి, గ్రామస్తులు గణేష్, మహేందర్‌రెడ్డి, సుస్రత్‌బేగం, నరేందర్‌రెడ్డి, జంగయ్య, మల్లేష్, లింగం, నందు, మల్లేష్, శ్రీను, జనార్ధన్, సత్య, బాసు, రెడ్యా, గోపాల్, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎల్. నర్సింహులు అన్నారు. షాబాద్ మండలం మద్దూర్ పాఠశాలలో శంకర్, మాలిని, స్వరూప టీచర్లు బదిలీపై వెళ్లడంతో వారిని సన్మానించారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమేనన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల ప్రధానకార్యదర్శి కృష్ణ, టీచర్లు డేవిడ్‌రెడ్డి, జయరాజ్ పాల్గొన్నారు. ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని ధర్మ సమాజ్ పార్టీ మండల కన్వీనర్ డప్పు రవీందర్ అన్నారు. కొందుర్గు మండలం ఉత్తరాస్‌పల్లి పాఠశాల నుంచి ఇటీవల బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లిన టీచర్లు వీరాచారి, కౌసల్యలను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. రవీందర్ మాట్లాడుతూ బడి అనే నారుమడిలో విద్య అనే విత్తనం వేసి, అక్షరం అనే నీరు పోసి, చెడు అనే కలుపు తీసి, నీతి అనే మంచి ఫలాన్ని సమాజానికి అందించే వారే ఉపాధ్యాయులన్నారు. తమ సేవాకాలంలో సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, గ్రామస్తులకు టీచర్లు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకట్‌రెడ్డి, స్థానికులు గోపాల్‌రావు, పెంటయ్య, వాజిద్, అజీమ్, అబీద్, సాయన్న పాల్గొన్నారు.



షాబాద్: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు



కొందుర్గు: ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న రవీందర్

విద్యార్థులు పట్టుదలతో చదువుకోవాలి

చేవెళ్ల, ఆగస్టు 24 : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకొని ఉన్నతులుగా ఎదగాలని చేవెళ్ల, ఆల్వాల్ సీఐలు భూపాల్‌శ్రీధర్, రాజేందర్‌గౌడ్, చేవెళ్ల ప్యాక్స్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం చేవెళ్లలోని వివేకానంద జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్ పార్టీని కేజీఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. స్టేట్ సెకండ్ ర్యాంకర్ ఎ.పూజకు ల్యాప్‌టాప్ బహుమతిగా ఇచ్చారు. టెన్త్‌లో 10జీపీఏ సాధించిన మనోజ్ఞకు 10వేల పారితోషికం ఇచ్చారు. విద్యార్థులు ఇష్టంతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థికి నగదు బహుమతి ఇస్తున్న డి.వెంకట్‌రెడ్డి

సంక్షిప్తంగా...

● **ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై ఉన్న వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్డీ) జెండా దిమ్మెను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నాయకులు శనివారం సీఐ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఓర్వలేకనే కొందరు ఈ దిమ్మెను ధ్వంసం చేశారని, దీనిపై విచారణ జరిపాలని ఎన్‌పీఆర్డీ జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు.

● **షాద్‌నగర్ అర్బన్:** షాద్‌నగర్‌లోని పటేల్‌రోడ్డులో గల ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో వినాయకుడి గుడి నిర్మాణానికి భూమి పూజచేశారు. మహేష్‌వర్మ, శ్రీధర్‌వర్మ కుటుంబాలు గుడి నిర్మాణానికి ముందుకొచ్చారు. కౌన్సిలర్ శ్రీనివాస్, ఆలయ కమిటీ చెన్నయ్య, రమేష్, సుధాకర్, విజయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటుకు ఉద్యమ కార్యాచరణ



విలేకరులతో మాట్లాడుతున్న రాఘవేందర్

కడ్తాల్, ఆగస్టు 24:హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై ఉన్న కడ్తాలలో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , యువజన సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆసుపత్రి ఏర్పాటు గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వైద్యఆరోగ్య శాఖమంత్రి దామోదర్ రాజనర్సింహ, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్‌లకు వినతిపత్రాలు పంపామన్నారు. కడ్తాలలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడ్తాలలో ప్రభుత్వ ఆసుపత్రి లేక సకాలంలో వైద్యం అందక అనేక మంది మృతిచెందినట్లు తెలిపారు. హైవేపై తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, క్షతగాత్రులను హైదరాబాద్ తీసుకుపోయే వరకు మృతిచెందుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి సాధనకు అవసరమైతే ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

నేటి నుంచి లలితశివాంజనేయస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం

కందుకూరు, ఆగస్టు 24: తిమ్మాపురంలో నిర్మించిన లలిత శివ ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు లక్ష్మీనర్సింహారెడ్డి, గోపాల్‌రెడ్డి వి.ఈశ్వర్ గౌడ్ తెలిపారు. ఈ ఆలయంలో ఆదివారం నుంచి ఈ నెల 28 వరకు విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలను నిర్వహిస్తామన్నారు. వేద పండితులు రేవల్లి రాజుశర్మ, పురోహితులు పేర్యాల హరికృపాల్‌శర్మ ఆధ్వర్యంలో నేటి సాయంత్రం 4:30గంటల నుంచి మహోత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. 26న అగ్నిప్రతిష్ఠ(108గుండాలతో) యజ్ఞం ఉంటుందన్నారు. సాయంత్రం జలాధివాసం హారతి ఉంటాయన్నారు. 27న ఉదయం ప్రాతఃకాల పూజలు, 28న ఉదయం ఆలయ గర్భగుడిలో గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శివ, నంది, లలితా త్రిపురసుందరి, ఆంజనేయ, నాగ, శిఖర, నవగ్రహ, ధ్వజస్తంభ యంత్ర, విగ్రహాల ప్రతిష్ఠను చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు పున్నా బిక్షపతి, శ్రీరాములు, కిషన్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, అమరేందర్‌రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.



నిర్మించిన ఆలయం